సాక్షి శ్రీకాకుళం

సోమవారం : 19 ఆగస్టు 2024



అందుకో ఉపకారం..

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. జోరుగా దరఖాస్తు చేసుకుంటున్నారు.

- 8లో



దుమ్ము రేపుతున్నారు..

సాఫ్ట్‌బాల్ స్టేట్‌మీట్‌లో మన ఆటగాళ్లు దుమ్ము రేపుతున్నారు. బాలబాలికల జట్లు ఫైనల్ చేరాయి.

- 8లో

ఐసెట్ అలాట్‌మెంట్‌లు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఐసెట్-2024 అలాట్‌మెంట్‌లను ఉన్నత విద్యా మండలి ఈ నెల 20వ తేదీన ప్రకటించనుంది. కౌన్సెలింగ్ ఈ నెల 12 తేదీలో పూర్తికాగా, అలాట్‌మెంట్‌లు 14న ప్రకటించాల్సి ఉండగా 20కి వాయిదా పడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంసీఏ కోర్సు నిర్వహిస్తుండగా, ఎంబీఏ కోర్సు వర్సిటీతో పాటు మరో మూడు ప్రైవేట్ కళాశాలల్లో నిర్వహిస్తున్నారు. అలాట్‌మెంట్‌ల కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

న్యూస్‌రీల్

శ్రీకాకుళం డీఎస్పీగా వివేకానంద



శ్రీకాకుళం నూతన డీఎస్పీ సీహెచ్ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం డీఎస్పీగా సీహెచ్ వివేకానందను నియమిస్తూ మంగళగిరి డీజీపీ కార్యాలయం నుంచి ఆదివారం ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం ఈయన విశాఖపట్నం మహిళా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా ఉన్నారు. 1991 బ్యాచ్ ఎస్ఐగా డిపార్ట్‌మెంట్‌లో చేరిన ఈయన విశాఖ జిల్లాలోనే ఎస్ఐగా పాడేరు, భీమిలి, కె.కోటపాడు, గోపాలపట్నంలోను, సీఐగా విశాఖ ఇంటిలిజెన్స్, మల్కాపురం, మధురవాడ, హార్బర్, విశాఖ రూరల్ స్పెషల్ బ్రాంచి, గాజువాకలో పనిచేశారు. 2014లో గాజువాకలో ఉన్నప్పుడే డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది మన జిల్లాలోనే స్పెషల్‌బ్రాంచి, కాశీబుగ్గలో చేశారు. అనంతరం విజయవాడ డీజీపీ కార్యాలయంలో కొన్నేళ్లు, అనంతపురం బెటాలియన్, అక్కడి నుంచి విశాఖ మహిళా పీఎస్ డీఎస్పీగా చేశారు. వారం రోజుల ముందే ఇక్కడ పనిచేసిన డీఎస్పీ వై.శృతి మంగళగిరి డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ అవ్వమని ఉత్తర్వులు వచ్చినా రిలీవర్ రాకపోవడంతో ఇక్కడే ఉన్నారు. ఇక జిల్లాలోని స్పెషల్‌బ్రాంచి డీఎస్పీగా ఉన్న ఎ.త్రినాథరావు విశాఖపట్నం డీఎస్ఆర్‌పీకి బదిలీ చేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'సస్య రక్షణ పద్ధతులు తప్పనిసరి'



చేపేనపేటలో పంటపొలంలో రైతులకు ప్రాక్టికల్‌గా వివరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పంటల్లో మేలైన సస్యరక్షణ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్ టు ప్రతినిధి సురేష్ అన్నారు. ఆదివారం మండలంలోని చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ఈ పద్ధతిలో పాటించాల్సిన సూత్రాలను రైతులకు వివరించారు. పసుపు పూసిన జిగురు అట్టలను, పక్షి స్థావరాలను పొలంలో పెట్టించామని తెలిపారు. ఇవి పంటలో పెట్టడం వల్ల ప్రధానంగా పంటను ఆశించే దోమ ఉద్ధృతిని తెలుసుకోవచ్చని, అలాగే పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం వల్ల అవి పంటకు హాని చేసే పురుగులను తినేస్తాయని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి నక్క చిరంజీవి, సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ రైతులు సాంబమూర్తి, ఫల్గుణరావు పాల్గొన్నారు.

ఆదిత్యునికి శ్రావణ మాస ప్రత్యేక పూజలు



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: సూర్యనారాయణ మూర్తి ఆలయంలో శ్రావణ మాసం ప్రత్యేకంగా ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. వివాహాల సమయం కావడంతో జిల్లా నలుమూలల నుంచి ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల రూపంలో రూ. 1,22,900, విరాళాలు, పూజల రూపంలో రూ.1,16,600, ప్రసాదాల టిక్కెట్ల రూపంలో రూ.1,36,685 వరకు ఆదాయం వచ్చినట్లుగా ఆలయ అధికారులు తెలియజేశారు.

బీటెక్ 3, 5 సెమిస్టర్ ఫలితాల విడుదలకు సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీటెక్ 3, 5 సెమిస్టర్ ఫలితాలు విడుదలకు సిద్ధంగా ఉన్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ ఆదివారం వెల్లడించారు. ఈ ఫలితాలు రెండు రోజుల్లో ప్రకటిస్తామని అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని పరీక్షలు ఫలితాలు వర్సిటీ పరిధిలో త్వరిత గతిన విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు.





సిక్కోలు కీర్తి చక్రం

మేజర్ రామ్

సిక్కోలు కీర్తి పతాక సగర్వంగా ఎగురుతోంది. రేపటి తరాలు గర్వంగా చెప్పుకునేందుకు ఓ సైనికుడి విజయ గాథ సిద్ధమవుతోంది. బిడ్డల గుండెల్లో పిరికితనాన్ని పోగొట్టి ధైర్యం నూరిపోయడానికి తల్లులకు 'మేజర్ రామ్' ప్రస్థానం ఓ సాహస కథగా పురుడు పోసుకుంటోంది. దేశ రక్షణలో చూపిన అసమాన సాహసానికి మన జవాను అత్యంత ప్రతిష్టాత్మక 'కీర్తి చక్ర' పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ పురస్కారం అందుకుంటున్న తొలి తెలుగువాడిగా నగిరిపెంటకు చెందిన మళ్ల రామ్‌గోపాలనాయుడు రికార్డు సృష్టించాడు. అందుకే మేజర్ రామ్.. అందుకో మా సలామ్ అంటూ యావత్తు సిక్కోలు నిండు హృదయంతో శుభాకాంక్షలు చెబుతోంది.

- కీర్తి చక్ర పురస్కారానికి ఎంపికైన మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడు
- ఈ పురస్కారానికి ఎంపికైన తొలి తెలుగు వాడిగా రికార్డు
- ఆయన స్వస్థలం సంతబొమ్మాళి మండలం నగిరిపెంట
- సాధారణ రైతు కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగిన యువకుడు
- ఉగ్రవాదులను మట్టుబెట్టి, అద్భుత నాయకత్వం ప్రదర్శించినందుకు కీర్తిచక్ర పురస్కారం
- గర్వపడుతున్న సిక్కోలు ప్రజలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

తెలుగు వాళ్లెవరికీ సాధ్యం కాని రీతిలో సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మళ్ల రామ్‌గోపాలనాయుడు రక్షణ వ్యవస్థలో రెండో అత్యున్నత పురస్కారమైన 'కీర్తి చక్ర'కు ఎంపికయ్యారు. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్య సాహసానికి మెచ్చి ఈ అవార్డు వచ్చి వరించింది. ఆయన 2023 అక్టోబర్ 26న జరిగిన ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించారు. ఉగ్రవాదులతో వీరోచితంగా పోరాడారు. ఆ పోరాటాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. దీంతో నగిరిపెంటతో పాటు జిల్లా అంతా గర్వపడుతోంది.

నగిరిపెంట నుంచి కీర్తిచక్ర వరకు

నగిరి పెంటకు చెందిన సన్నకారు రైతు మళ్ల అప్పలనాయుడు, హేమమాలిని దంపతులకు 1995 జూన్ 16న రామ్‌గోపాలనాయుడు జన్మించారు. దండుగోపాలపురం శాంతినికేతన్ ప్రైవేట్ స్కూల్‌లో ఒకటో తరగతి చదివారు. రెండో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కోటబొమ్మాళి వంశధార ప్రైవేటు స్కూల్‌లో విద్యనభ్యసించారు. 2005లో విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌కు ప్రవేశ పరీక్షలో ఎంపికయ్యారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. 2012లో యూపీఎస్సీ నిర్వహించిన స్టాఫ్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఎగ్జామ్ రాసి పూణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికయ్యారు. అక్కడ మూడేళ్లు అభ్యసించి, 2015-16లో డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీలో క్యాడెట్‌గా చేరారు. అక్కడ శిక్షణ తీసుకున్న 900మందిలో గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచి, ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. లెఫ్టినెంట్‌గా పనిచేసిన రెండేళ్లలో(2018)నే కెప్టెన్‌గా పదోన్నతి సాధించారు. అక్కడికి నాలుగేళ్లలో (2022)లో మేజర్‌గా ప్రమోషన్ లభించింది. ప్రస్తుతం మేజర్‌గా పనిచేస్తున్నారు. సన్నకారు రైతు కుటుంబం నుంచి వచ్చి పిన్న వయస్సులో ఆర్మీలో మేజర్ స్థాయికి ఎదిగి, దేశ రక్షణ వ్యవస్థలో రెండో అత్యున్నత పురస్కారమైన కీర్తిచక్రకు ఎంపికైన తొలి తెలుగు వాడిగా చరిత్రలో తన పేరును లిఖించుకున్నారు.

కుటుంబ నేపథ్యం



భార్య ఐశ్వర్య, కుమార్తె ఐరాతో రామ్‌గోపాలనాయుడు

మేజర్ రామ్‌గోపాలనాయుడుకు ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. వారిలో ఒక తమ్ముడు లక్ష్మీనారాయణ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మెకానిల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడలిస్టుగా నిలిచాడు. ఈయన ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుని ప్రస్తుతం ఇంటి వద్దనుంచే ప్రిపేరవుతున్నారు. మరో తమ్ముడు అజిత్‌కుమార్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మేజర్ రామ్‌గోపాలనాయుడుకు భార్య ఐశ్వర్య, కుమార్తె ఐరా ఉన్నారు. ప్రస్తుతం వీరంతా ఇక్కడే ఉంటున్నారు.

వీరోచిత పోరాటమది..



జమ్ముకశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌లో పనిచేస్తున్న రామ్‌గోపాలనాయుడు కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద మోహరించిన ఆకస్మిక సైనిక(పెట్రోలింగ్) బృందానికి లీడర్‌గా వ్యవహరించారు. 2023 అక్టోబర్ 26 ఉదయం 10.10 గంటలకు ఐదుగురు ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని ఓ జవాన్ ద్వారా తెలుసుకున్నారు. 10.25 గంటలకు రంగంలోకి దిగిన రామ్‌గోపాలనాయుడు తోటి జవాన్లకు మార్గనిర్దేశం చేసి, ఉగ్రవాదులను పట్టుకోవడానికి ప్రయత్నించారు. తన దళాలకు ప్రమాదాన్ని గ్రహించి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఒక ఉగ్రవాదిని హతమార్చారు. మరొక ఉగ్రవాదిని గాయపరిచినప్పటికీ ఆ ఉగ్ర వాది భారీ కాల్పులు జరిపాడు. ఆ భీకర కాల్పుల మధ్య జవాన్లతో కలిసి ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఓ ఉగ్రవాది ఒక గుహలో దాగి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఆర్మీ బృందంపై గ్రనేడ్ కూడా విసిరాడు. దాని నుంచి తప్పించుకుని భయపడకుండా ఆ ఉగ్రవాదిని పట్టుకుని హతమార్చారు. తన పోరాటంలో భాగంగా జవాన్లను కాపాడుకోవడం కోసం ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించారు. క్లినికల్ ఆపరేషన్ చేసి, తిరుగులేని నాయకత్వం ప్రదర్శించి, ఇద్దరు ఉగ్రవాదులను నేరుగా హతమార్చి, తన సైనికుల ప్రాణాలను కాపాడటంలో అసామాన్య ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు కేంద్ర ప్రభుత్వం రామ్‌గోపాల నాయుడికి రక్షణ వ్యవస్థలో రెండో అత్యున్నత పురస్కారమైన కీర్తిచక్ర అవార్డును ప్రకటించింది. త్వరలో రాష్ట్రపతి ఏర్పాటు చేయబోయే కార్యక్రమంలో ఆ పురస్కారం ప్రదానం చేయనున్నారు.

మా గ్రామానికి గుర్తింపు



ఆర్మీ మేజర్ రామ్‌గోపాలనాయుడు వల్ల మా గ్రామానికి దేశంలో ఒక గుర్తింపు వచ్చింది. గ్రామానికి చెందిన వ్యక్తి ఉగ్రవాదులతో పోరాడి కీర్తిచక్ర పురస్కారం పొందడం మాకు ఎంతో గర్వంగా ఉంది. రామ్‌గోపాలనాయుడు వల్ల మా గ్రామానికి ఎంతో పేరు, గౌరవం దక్కాయి.

– శవ్వాన రమేష్, నగిరిపెంట గ్రామం.

గర్వంగా ఉంది

దేశ సేవలో నా కుమారుడు పనిచేయడం గర్వంగా ఉంది. చేసిన సేవకు గుర్తింపుగా కీర్తి చక్ర అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రతి యువకుడు దేశ సేవ చేయాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను. మా రామ్‌గోపాలనాయుడ్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– మళ్ల అప్పలనాయుడు, మేజర్ రామ్‌గోపాలనాయుడు తండ్రి.



గ్రేటెస్ట్ అచీవ్‌మెంట్

తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా కీర్తిచక్ర పురస్కారానికి ఎంపికైన వ్యక్తిగా మా అన్నయ్య నిలవడం మాకెంతో సంతోషంగా ఉంది. అన్నయ్య ఫోన్ చేసి చాలా ఆనందంగా ఉందని చెప్పాడు. గ్రేటెస్ట్ అచీవ్‌మెంట్ సాధించాడు. ఇంతకంటే గొప్ప విషయం ఇంకేముంటుంది. తమ్ముళ్లుగా గర్వ పడుతున్నాం.

– లక్ష్మీనారాయణ, అజిత్‌కుమార్, మేజర్ రామ్‌గోపాలనాయుడు సోదరులు



'ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించండి'



శ్రీకాకుళం అర్బన్: ప్రజలకు సేవలందించే ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన ఆవశ్యకత ప్రభుత్వాలపై ఉందని ఏపీ ఎన్‌జీఓ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతా యువ వైద్యురాలిపై అకృత్య ఘటనతో దేశమంతా కంపిస్తోందని, పనిచేసే చోట మహిళలకు కనీస భద్రత లేకుండా పోతోందని, అన్ని వర్గాలూ ఏకతాటి పైకి వచ్చి నినదిస్తున్నాయని పేర్కొన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు చేసినా, అమలులో ఉదాసీన వైఖరి కారణంగా చట్టాలు నీరుగారుతున్నాయని తెలిపారు. కోవిడ్ వారియర్స్ అని పొగిడి సత్కారాలు చేసిన వైద్యులకు ఆస్పత్రుల్లో భద్రత ఎంతనేది ప్రశ్నార్థకంగా మారిందని, వైద్య కళాశాలలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో, మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న ప్రదేశాల్లో ఉమెన్ ఫ్రెండ్లీగా ఉందా లేదా అనేది చూడాలన్నారు.

మహిళా ఉద్యోగులు రాత్రి పూట విధులు నిర్వహించే సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక అమరిక కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పనిచేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు కచ్చితంగా ఏర్పాటు చేయాలని కోరారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక (పోష్) చట్టం అమలులో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. తాజాగా సుప్రీంకోర్టు దీనిపై ప్రభుత్వాలకు సూచనలు చేసిందని పేర్కొన్నారు. మహిళలు పనిచేసే ప్రతిచోట ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ, లోకల్‌కంప్లైంట్ కమిటీలు ఉండాలని, డ్యాష్ బోర్డు నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే షీ బాక్సులు అన్నిచోట్లా ఉండాలనే నిబంధన పెట్టాలన్నారు. పోష్ చట్టం అమలుకు ప్రత్యేక బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించి చట్టాలను కఠినంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఇదో రకం చోరీ

- పొలాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం
- రాగిలోహం, ఆయిల్ అపహరణ
- జిల్లాలో వెలుగుచూస్తున్న ఘటనలు



కిట్టాలపాడులో ట్రాన్స్‌ఫార్మర్‌లో చోరీకి గురైన రాగి లోహం

హిరమండలం: జిల్లాలో కొత్త రకం దొంగలు పుట్టుకువస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో లోహాలతో పాటు ఆయిల్‌ను దొంగతనం చేస్తున్నారు. చాలాచోట్ల పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్లు సైతం చోరీకి గురవుతున్నాయి. జిల్లాలో హిరమండలం, రణస్థలం, టెక్కలి, నందిగాం, జలుమూరు, కోటబొమ్మాళి, సారవకోట, ఎచ్చెర్ల మండలాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

వ్యసనపరుల పనే..

మద్యం, జూదానికి అలవాటుపడిన యువత ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆయా గ్రామాల్లోని రైతులు ఆరోపిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ మోటార్లు ఏర్పాటు చేసి సాగు చేస్తుంటారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అమలు చేస్తుండడంతో పంపుసెట్లకు ప్రత్యేక లైన్ ఉంటుంది. రోజుకు నిర్దిష్ట సమయం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఈ లైన్‌కు సరఫరా ఉంటుంది. దీంతో ఇది చోరులకు కలిసి వస్తోంది. రైతులకు శాపంగా మారుతోంది. కరెంటు లేని రాత్రి సమయాల్లో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి.

పాత ట్రాన్స్‌ఫార్మర్లే టార్గెట్

పాత ట్రాన్స్‌ఫార్మర్లనే ఎక్కువగా దొంగతనం చేస్తున్నారు. పదేళ్ల కిందట ఏర్పాటుచేసిన వాటిలో అధికంగా రాగి వస్తుంది. ఆయిల్ సమకూరుతుంది. పాత వాటిలో 14 కిలోలకుపైగా కాపర్ ఉంటుంది. కిలో కాపర్ రూ.2500 వరకూ పలుకుతుంది. అందుకే వాటిని టార్గెట్ చేస్తున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేస్తే రూ.30 వేల వరకూ లబ్ధి పొందవచ్చు. ఇలా చోరీ చేస్తున్న కాపర్‌ను ఒడిశాలోని జైపూర్, బరంపూర్, కటక్ వంటి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. చోరీల నుంచి కాపర్ కొనుగోలు చేసే వ్యాపారుల వరకూ ఒక ముఠా నడుస్తున్నట్టు అనుమానాలు ఉన్నాయి.

కాపర్ స్థానంలో అల్యూమినియం

సాధారణంగా 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.4 లక్షల వరకూ ఉంటుంది. దానిలో కాపర్ విలువ రూ.70 వేలు వరకూ పలుకుతుంది. కాపర్ తరచూ చోరీ జరుగుతుండడంతో అధికారులు ప్రత్యామ్నాయంగా అల్యూమినియంను ట్రాన్స్‌ఫార్మర్లలో అమర్చుతున్నారు. అందుకే దొంగలు తెలివిగా పదేళ్ల కిందట ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్నారు. అయితే దొంగలు దొంగతనం క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్లను తెరిచి ఉంచుతున్నారు. వైర్లను ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది.

ఆందోళన కలిగిస్తోంది



పొలాల్లో విద్యుత్ మోటార్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండా పోతోంది. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. మోటార్లతో వరికి నీటి తడులు అందించాల్సిన పరిస్థితి. ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి దొంగిలించడంతో ఇప్పుడు సరఫరా నిలిచిపోయింది. ఇప్పుడు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు

● వీటికే ఇప్పుడు గి'రాఖీ'



రాఖీ పండగ నాడు అక్కచెల్లెళ్లు కొత్త కొత్త రాఖీలను వెతికి మరీ కడుతుంటారు. ఈ రాఖీ పండుగకు ఫొటో రాఖీలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. సాధారణ రాఖీ కాకుండా సోదరుడి ఫొటోతో కూడిన రాఖీని కట్టేందుకు సోదరీమణులు ఆసక్తి చూపుతున్నారు. - కాశీబుగ్గ

వానలోనూ సడలని బోల్‌భమ్ శివ దీక్ష



కుండపోత వర్షంలో బాహుదా నదీ జలాన్ని తీసుకెళ్తున్న భోల్‌భమ్ శివభక్తులు

ఇచ్ఛాపురం: పట్టణంలో భోల్‌భమ్ శివ స్వాములు వానలోనూ తమ దీక్షను కొనసాగించారు. పట్టణంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 200 మంది బోల్‌భమ్ స్వాములు ఆదివారం సాయంత్రం స్థానిక బాహుదానది నుంచి నదీజలాలను సేకరించారు. ఇలా సేకరించిన జలాలతో సమీప గ్రామాల్లోకి కాలినడకన వెళ్లి సోమవారం ఆయా గ్రామాల్లో గల ప్రత్యేక శివాలయాల్లో అభిషేకం చేస్తారు. శివాలయంలో లింగానికి మొదటి పూజ చేసి అభిషేకం జరిగే వరకు బాహుదా నది నుంచి సేకరించిన జలాలను కింద పెట్టకూడదు. ఆదివారం పట్టణంలో కుండపోత వాన కురిసినా భక్తులు వెరవకుండా శివుడిని ధ్యానిస్తూ ముందుకు కదిలారు.

● బియ్యపు గింజంత రాఖీ



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు గాంధీనగర్‌కు చెందిన సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారి అతి సూక్ష్మ బంగారు రాఖీని తయారు చేశారు. సుమారు రెండు గంటలు కష్టపడి అర సెంటీమీటర్ సైజులో ఈ రాఖీని తయారు చేశారు. పలుచటి బంగారపు రేకు పైన ఎలాంటి అతుకులు లేకుండా అతి చిన్న సూక్ష్మ స్వర్ణ రాఖీని కేవలం 0.10 మిల్లీగ్రామ్ బరువు కలిగి ఉండి, రూ.70 విలువ గల బంగారంతో తయారు చేసినట్లు ఆయన తెలిపారు.

– కాశీబుగ్గ

క్లుప్తంగా

విగ్రహం పరిశీలన


విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణ

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి రాతి విగ్రహానికి సంబంధించి కాళ్లు ధ్వంసమైన నేపథ్యంలో ఆదివారం రూరల్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణ స్వయంగా విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. శనివారం వరకు జాతీయ రహదారి పనులు చేపట్టిన కూలీలు ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చన్న అనుమానాన్ని గ్రామస్తులు వ్యక్తం చేశారు.

'గెస్ట్ ఫ్యాకల్టీలకు రూ.37 వేలు జీతం ఇవ్వాలి'


టెక్కలిలో గెస్ట్ ఫ్యాకల్టీ సమావేశంలో నూతన కార్యవర్గం

టెక్కలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలకు రూ.37 వేల జీతం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జగ్గారావు, బి.గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీలకు ఉద్యోగ భద్రత కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షునిగా సీహెచ్ రవికుమార్, కోశాధికారిగా సీహెచ్ వసంతరావు, ప్రతినిధులుగా కె.నరసింహమూర్తి తదితరులు ఎన్నికయ్యారు.

అరటి గెలల వ్యాన్ బోల్తా


రహదారికి అడ్డంగా బోల్తా పడిన అరటి గెలల వ్యాన్

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం అరటి గెలల వ్యాన్ బోల్తా పడింది. ఈ మేరకు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావులపాలేం నుంచి అరటి గెలలు లోడ్ చేసుకుని వ్యాన్ కటక్ వైపు వెళ్తుండగా టెక్కలి సమీప కె.కొత్తూరు వద్దకు వచ్చే సరికి వ్యాన్ వెనుక టైర్ పంక్చర్ అవ్వడంతో ఒక్కసారిగా వ్యాన్ అదుపు తప్పి రోడ్డుకు మధ్యలో బోల్తా పడింది. అయితే వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్లు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వ్యాన్‌లోని అరటి గెలలు రహదారిపై పడిపోవడంతో కొంత సమయం ట్రాక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించారు.

తిరుమలకు గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీ భజన మండలి ఎంపిక


మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళ్తున్న భజన బృందం

కొత్తూరు: తిరుమల తిరుపతి దేవస్థానంలో భజన చేసేందుకు కొత్తూరు మండలం గూనభద్ర ఆర్‌ఆర్ కాలనీకి చెందిన వన మహాలక్ష్మి భజన బృందం ఎంపికైంది. ఈ నెల 20వ తేదీన టీటీడీలో భజన చేసేందుకు భజన బృందం బయల్దేరి వెళ్లిందని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెదకోట సాదుబాబు, భజన బృందం గురువు యర్లంకి వెంకటరావు తెలిపారు.

హిందూ ధర్మ పరిరక్షణ కోసం..


పలాస చేరుకున్న నర్మదానంద స్వామీజీ

కాశీబుగ్గ: అఖండ భారత్‌లో 52 శక్తి పీఠాలు, 12 జ్యోతిర్లింగాలు ఉన్నాయని, కొన్ని శక్తి పీఠాలు భక్తుల దర్శనాలకు నోచుకోవడం లేదని, అవి తెరుచుకోవాలని కోరుతూ కాలి నడకన యాత్ర చేస్తున్నామని నర్మదానంద స్వామీజీ తెలిపారు. ఆయన యాత్ర ఆదివారం పలాస చేరుకున్న సందర్భంగా భక్తులు స్వాగతం పలికారు. నర్మద నదీ సమీపాన ప్రారంభించి కాలి నడకన 31 శక్తి పీఠాలు దర్శించుకున్నారు. పలాస జాతీయ రహదారి మీదుగా కాలినడకన వెళ్తున్న స్వామికి స్థానికులు సపర్యలు చేశారు.

అందుకో ఉపకారం..

- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 6 వరకు అవకాశం
- 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున ప్రోత్సాహం
- ఈ ఏడాది డిసెంబర్ 8న రాత పరీక్ష


విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ, నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ.. ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పించి, వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోంది. అందులో ప్రధానమైనది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పథకం. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ప్రతీఏట ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపి ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యేంత వరకూ ఏటా రూ.12 వేలుచొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందుతుంది. ఈ ఏడాది ఎక్కువ మంది ఈ పరీక్ష రాసేలా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం..

8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ఆన్‌లైన్‌లో మొదలైంది. ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీన మొదలైన ఈ ప్రక్రియ సెప్టెంబర్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. పరీక్షా రుసుం చెల్లించడానికి సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు ఉంటుంది. డిసెంబర్ 8వ తేదీన ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.50 చొప్పున ఫీజు ఆన్‌లైన్‌లో సూచించిన ఎస్‌బీఐ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

ఈ అర్హతలు తప్పనిసరి..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు 27,599 మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 18,931 మంది ఉన్నారు. ఈ ప్రోత్సాహకాలకు ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు, తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొందిన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించాలి. అలాగే కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ.3.50 లక్షలకు మించకూడదు.

అవకాశం వినియోగించుకోండి



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఎన్‌ఎంఎంఎస్ పథకం పేద విద్యార్థులకు ఎంతో బాసటగా ఉంటుంది. ఉన్నత విద్య అభ్యసనకు ఎంతగానో దోహదపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ఏటా ఈ పథకానికి ఎంపికవుతున్నారు. ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

కూరగాయల షాపులో అగ్ని ప్రమాదం


కాలిపోతున్న కూరగాయల షాపు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస జంక్షన్ వద్ద అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు పక్కనే ఉన్న కూరగాయల దుకాణంలో శనివారం అర్ధరాత్రి తర్వాత అగ్ని ప్రమాదం జరిగింది. ఇదే మండలం పెద్దకొల్లివలస గ్రామానికి చెందిన మొగిలి రామారావు మోదుగువలస జంక్షన్ వద్ద రోడ్డు పక్కన స్థలం అద్దెకు తీసుకుని రేకులషెడ్ ఏర్పాటు చేసుకుని కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నాడు. శనివారం రాత్రి షాపు కట్టేసిన తర్వాత రామారావు ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి తర్వాత జరిగిన అగ్ని ప్రమాదంలో షాపులో ఉన్న కూరగాయలు, బెంచీలు, చెక్క బల్లలతో పాటు రేకులషెడ్ పూర్తిగా కాలిపోయింది. అగ్ని ప్రమాదానికి కారణం తెలియనప్పటికీ ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని బాధితుడు రామారావు చెబుతున్నారు. స్థానికులు స్పందించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదని, షాపు పూర్తిగా కాలిపోయిందని తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రామారావు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


రోడ్డుపై ఉన్న మృతదేహం


ఇన్‌సెట్‌లో పురియా చిన్న (ఫైల్)

కంచిలి: మకరాంపురం గ్రామంలోని సంత కూడలి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే మండలం మండపల్లి పంచాయతీ పరిధి ఒరియా నారాయణపురం గ్రామానికి చెందిన పురియా చిన్న(59) అనే వ్యక్తి మృతి చెందారు. చిన్న ప్రతి ఆదివారం తాను పండించిన కూరగాయల్ని సంతకు తీసుకొచ్చి విక్రయించి, తనకు కావాల్సిన సరుకుల్ని కొనుగోలు చేస్తుంటాడు. ఎప్పటిలాగే ఈ ఆదివారం కూడా తన పొలంలో పండించిన మిరపకాయల్ని తోటి రైతు బి.త్రినాథ్‌తో కలిసి సంతకు తీసుకువచ్చాడు. ఉదయం 6 గంటల సమయంలో మిరపకాయల మూట పట్టుకొని రోడ్డు దాటుతుండగా.. ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి చిన్నను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న నడుం భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. తీవ్ర గాయాలపాలైన చిన్న అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుని కుమార్తె పురియా జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నకు భార్య మాలతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న మృతి వార్త తెలిసి వారు కన్నీరుమున్నీరయ్యారు.

'బాడీబిల్డింగ్‌కు ఆదరణ మరింత పెరగాలి'


డాక్టర్ బాడాన దేవభూషణ్‌ను అభినందిస్తున్న వి.శ్రీనివాసరాజు, బాడీబిల్డింగ్ సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో, జిల్లాలోనూ బాడీబిల్డింగ్‌కు మరింత ఆదరణ పెరగాలని ది ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు అన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ది ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ బాడాన దేవభూషణరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ బాడీబిల్డింగ్‌పై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, వాటి విడనాడాలని కోరారు. త్వరలో తాము వైట్ రైస్ ప్రోటీన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, దీనివల్ల సైడ్ ఎఫెక్టులు ఉండవని చెప్పారు. అనంతరం బాడానను సత్కరించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని త్వరలో ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొయ్యాన గౌరీశంకర్, అరుగుల సంతోష్, బట్న నవీన్, ఎస్.భాస్కరరావు, ఆర్‌గణేష్, బి.నాని, బి.అరవింద్, కె.లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

'శాకాహారమే తినాలి'


ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర మెగా శాకాహార సద్భావన ర్యాలీని సుమారు వెయ్యి మందితో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ ప్రభు శ్రీనివాస్ గోవింద్ మాట్లాడుతూ శాకాహార ప్రపంచంగా రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంబేడ్కర్ ఆడిటోరియం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏడురోడ్ల కూడలికి చేరి అక్కడి నుంచి తిరిగి ఆడిటోరియం వరకు జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, పిరమిడ్ ప్రతినిధులు దాట్లరాయ జగపతిరాజు, సిద్దా నాగేశ్వరరావు, ఇందిరా లక్ష్మీ, రేవతి, రామకృష్ణ, బాలాజీ, బిందుమాధవి, యోగాచార్య రామారావు, ఓంశాంతి ప్రతినిధులు, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ నుంచి కార్యకర్తలు హాజరయ్యారు.

అంగూరులో కల్వర్టు నిర్మాణం

కొత్తూరు: అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ నుంచి భారీ ఇసుక లారీలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో అంగూరు గ్రామం వద్ద ఉన్న కల్వర్టు కూలిపోయింది. దీంతో వైఎస్సార్‌సీపీ నేత సర్పంచ్ శిమ్మ మధుసూదనరావులతో పాటు అంగూరు గ్రామస్తులు వాహనాలను అడ్డుకున్నారు. కల్వర్టు బాగు చేసిన తర్వాతే స్టాక్ పాయింట్‌కు వాహనాలు విడిచిపెడతామని అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు స్పందించి ఆదివారం కల్వర్టును బాగు చేశారు. పనులను టెక్కలి ఆర్డీఓ సుదర్శన్ దొర, కొత్తూరు తహసీల్దార్ పాపారావుతో పాటు మైన్స్ అధికారులు పరిశీలించారు.

పేకాట శిబిరంపై దాడి

ఆమదాలవలస: మండలంలోని దన్నానపేట సమీపంలో గల ఎస్‌వీఎస్ దాబా పక్కన తోటలో పేకాట శిబిరంపై ఆదివారం ఆమదాలవలస పోలీసులు చేసిన దాడిలో ముగ్గురు వ్యక్తులు పట్టుపడినట్లు ఎస్‌ఐ కె.వెంకటేష్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.46,100 నగదు, 2 ద్విచక్రవాహనాలు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దుమ్ము రేపుతున్న..

శ్రీకాకుళం సాఫ్ట్‌బాల్ జట్లు

- ఫైనల్స్‌కు చేరుకున్న బాలురు
- తుది పోరుకు సిద్ధమైన బాలికల జట్టు
- గట్టి పోటీనిస్తున్న గుంటూరు, విజయనగరం, అనంతపురం జట్లు
- నేటితో ముగియనున్న 11వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు


సెమీఫైనల్స్‌లో గెలుపొందిన విజయానందంలో శ్రీకాకుళం బాలికల జట్టు


ఫైనల్స్‌కు చేరుకున్న శ్రీకాకుళం బాలురు జట్టుతో నిర్వాహకులు, అతిథులు, కోచ్‌లు, పీడీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాఫ్ట్‌బాల్ జూనియర్స్ స్టేట్‌మీట్‌లో ఆతిథ్య శ్రీకాకుళం జిల్లా జట్లు అద్భుతమైన ఆటతీరుతో దుమ్మురేపుతున్నాయి. ఓటమి చవిచూడకుండా టోర్నీల్లో దాదాపు అన్ని మ్యాచుల్లోను విజయబావుటా ఎగురవేసిన శ్రీకాకుళం జట్లు బాలబాలికల రెండు విభాగాల్లో పతకాలు(ప్లేస్‌లు) ఖాయం చేసుకున్నాయి. శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానం వేదికగా 11వ ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లాల)జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 ఆద్యంతం హోరాహోరీగా సాగుతోంది. ఆదివారం లీగ్‌దశ ముగిసి జరిగిన క్వార్టర్స్‌ఫైనల్స్ మ్యాచ్‌లన్నీ రక్తికట్టించాయి. పోటీలను చూసేందుకు హాజరైన విద్యార్థులు, యువతతో మైదానంలో సందడి వాతావరణం నెలకొంది. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర చైర్మన్, జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు ఏర్పాట్లను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ సంఘ కోశాధికారి నరసింహరెడ్డి, జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, జిల్లా చైర్మన్ బడగల హరిధరరావు, ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, ఒలింపిక్ సంఘ జిల్లా కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు మాస్టారు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఆకట్టుకున్న క్యాంప్ ఫైర్..

ఆదివారం రాత్రి జరిగిన క్యాంప్ ఫైర్ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి.

స్టేట్‌మీట్ పోటీల పరిస్థితి ఇది..

బాలురు విభాగం: శ్రీకాకుళం–విజయనగరం జట్లు ఫైనల్స్‌కు దూసుకెళ్లాయి. నేడు జరిగే అమీతుమీ పోరులో విజేత, రన్నరప్‌లు ఖరారవుతాయి. ఇక మూడో స్థానంలో అనంతపురం, నాల్గో స్థానంలో గుంటూరు నిలిచింది.

బాలికల విభాగం: సెమీఫైనల్స్ మ్యాచ్‌ల్లో విజయనగరం–కృష్ణాజిల్లాతో జరిగిన మ్యాచ్‌లో 5–1తేడాతో విజయనగరం, గుంటూరుతో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో 3–2 తేడాతో శ్రీకాకుళం జట్లు గెలుపొందాయి. నేడు జరిగే బెస్ట్ ఆఫ్ త్రీఫైనల్స్ కీలక మ్యాచ్‌తోపాటు, ఫైనల్స్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

'ఆదివాసీలపై దాడులను ఖండించాలి'


సభలో మాట్లాడుతున్న చిలకా చంద్రశేఖర్

పలాస: ఆదివాసీలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ కోరారు. పలాస మండలం నీలావతి గ్రామంలో ఆదివారం ఆదివాసీ హక్కులపై బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముందు వివిధ ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి ఆదివాసీలకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దండకారణ్యంలో కగార్ ఆపరేషన్ పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఆదివాసీలపై దాడులకు పాల్పడుతుందని, ఈ దుశ్చర్యను పౌర సమాజం, మేధావులు, ప్రజా సంఘాలు ఖండించాలని, ఆదివాసీలు చేస్తున్న పోరాటాలకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. దేశంలో అనేక రూపాల్లో అన్ని రంగాలపైన కూడా విధ్వంసం జరుగుతోందని, జీవించే హక్కు ప్రమాదంలో పడిందన్నారు. దీనికి ప్రజాఉద్యమాల ద్వారానే తిప్పి కొట్టాలని పిలునిచ్చారు. పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.దానేసు అధ్యక్షతన జరిగిన ఈ సభలో పీడీఎం నాయకులు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వినోద్, లక్ష్మణ్, భీమారావు, ప్రజాకళా మండలి నాయకుడు కొర్రాయి నీలకంఠం, పీఓడబ్ల్యూ నాయకురాలు బదకల ఈశ్వరమ్మ, పూర్ణచంద్రరావు,జోగి కోదండరావు, అరుణ, నాగమణి, త్రిలోచనరావు, ధనలక్ష్మి, పిండి వెంకటరావు,పుచ్చ దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా రాణిస్తున్న జిల్లా క్రికెట్ జట్టు


సెంచరీ చేసిన రామ్ కుమార్


4 వికెట్లు తీసిన ఎం.పూర్ణచంద్ర

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ అంతర్‌జోనల్ క్రికెట్ టోర్నీలో శ్రీకాకుళం జిల్లా సమష్టిగా రాణిస్తోంది. వైఎస్సార్ కడప జిల్లాలోని కేఎస్‌ఆర్‌ఎం కళాశాల మైదానం వేదికగా జరుగుతున్న ఏసీఏ అండర్–19 బాలుర టెస్ట్ (త్రీడేస్ మ్యాచ్) క్రికెట్ టోర్నీలో జిల్లా జట్టు కీలకమైన మొదటి ఇన్నింగ్స్‌లో 67 పరుగుల ఆధిక్యతను సాధించి మ్యాచ్‌పై పట్టు బిగించింది. చిత్తూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 356 పరుగులు వద్ద ఆలౌటైంది. జట్టులో ఓపెనర్ కె.థామస్ రామ్‌కుమార్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 157 బంతుల్లో 13 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 122 పరుగులతో వీరవిహారం చేశాడు. మరో ఓపెనర్, కెప్టెన్ నంబళ్ల సుశాంత్ 53 పరుగులు, ప్రద్న్యుష్ 50 పరుగుల అర్ధసెంచరీలతో రాణించగా, సాయిసుజన్ 46 పరుగులతో తనవంతు సహకారం అందించాడు. అంతకుముందు శ్రీకాకుళం లెఫ్టార్మ్ స్పిన్నర్ మొదలవలస పూర్ణచంద్రరావు స్పిన్ మ్యాజిక్‌తో చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 289 పరుగులకు కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 49 పరుగులతో బ్యాటింగ్ చేస్తోంది. శ్రీకాకుళం జట్టు ఇంకా 18 పరుగుల ఆధిక్యతలో ఉంది. శ్రీకాకుళం జట్టు బౌలర్లలో పూర్ణచంద్ర నాలుగు వికెట్లతో విజృంభించగా, జున్నారావు మూడు, సుశాంత్, ప్రద్న్యుష్, సాయిసుజన్ తలా వికెట్ పడగొట్టారు.

మేఘాల కెరటాలు..





పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఆదివారం కురిసిన వానకు ముందు మబ్బులు ఇలా కమ్మేశాయి. ఉవ్వెత్తున ఎగసిన కెరటంలా మేఘాలు కనిపించాయి. పలాస, తాళ్లభద్ర పరిసరాలలో కనిపించిన చిత్రాలివి. - కాశీబుగ్గ

వరకట్న వేధింపుల కేసు నమోదు

భోగాపురం: శ్రీకాకుళం చిన్న బజారుకు చెందిన వడ్డాది శంకర్‌గుప్తా అనే వ్యక్తిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన పద్మజ్యోతికి 2023లో శ్రీకాకుళం చినబజార్‌కు చెందిన వడ్డాది శంకర్‌గుప్తాతో వివాహం జరిగింది. వివాహ సమయంలో 17 తులాల బంగారం, రెండు కేజీల వెండితో పాటు ఆరు లక్షల రూపాయల నగదు కట్నకానుకల కింద అందజేశారు. సంవత్సరం పాటు వీరి దాంపత్య జీవితం సవ్యంగా సాగింది. ఇటీవల కాలంలో కారు కొనుగోలుకు రూ. పది లక్షలు తీసుకురావాలని గుప్తా తన భార్య పద్మజ్యోతిని వేధించసాగాడు. డబ్బులు తీసుకురాకపోవడంతో ఆమెను కన్నవారింట వదిలేసి వెళ్లిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.